క్లుప్తంగా

వీఎంసీలో నేడు 'స్పందన'

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం, నగరంలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగర వాసులు ఫిర్యాదులు, అర్జీలను అధికారులకు అందజేయాలన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



పాయకాపురం(విజయవాడరూరల్): పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి పిలుపునిచ్చారు. డివిజన్‌లోని సెవెన్ అపార్ట్‌మెంట్స్ వద్ద స్వచ్ఛత భారత్ అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రతతోనే రోగాలకు దూరంగా ఉండవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కృష్ణారావు, సూర్యనారాయణ, రామకోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా పాయకాపురం సబ్‌స్టేషన్, 11 కె.వి. డిస్నీ లాండ్ ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వి.సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాంబే కాలనీ, దేవినేని గాంధీపురం, పైపుల రోడ్డు, వైఎస్ఆర్ పార్క్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

గణనాథునికి నృత్య నీరాజనం



విజయవాడకల్చరల్: అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రుల సందర్భంగా సీతారామా కల్యాణ మండపంలో ఆదివారం నాట్యాచారిణి యల్లాజోస్యుల అనూరాధ బృందంలోని చిన్నారులు ప్రదర్శించిన అంశాలు ఆకట్టుకున్నాయి. శ్రీ గణనాథం, మోదక హస్తతో పాటు అన్నమయ్య, రామదాసు కీర్తనలకు నృత్యాలను అభినయించారు. ఉదయం సేవా సంఘ సభ్యులు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం కార్యదర్శి దశరథ రమేష్, కార్యదర్శి అనుముల సోమశేఖర్, కమిటీ సభ్యులు డాక్టర్ గురునాధ్ శర్మ,గణపతి మూర్తి, మహిళా కార్యదర్శులు దుర్గాసావిత్రి, శిరీష పాల్గొన్నారు.

అలరిస్తున్న గ్రేట్ బాంబే సర్కస్



లబ్బీపేట(విజయవాడతూర్పు): బృందావనకాలనీలోని వజ్ర గ్రౌండ్స్‌లో బాంబే సర్కస్ రోజుకు మూడు షోలు నిర్వహిస్తూ ప్రజలను అలరిస్తోందని నిర్వాహక సంస్థ మేనేజింగ్ పార్టనర్ కేఎం సంజీవ్, మేనేజర్ పీవీ ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట, సాయంత్రం 4, 7 గంటలకు షోలు ప్రదర్శిస్తున్నామన్నారు. ఈ సర్కస్‌లో ఇండియా, చైనా, నేపాల్, ఇథోసియా దేశాలకు చెందిన 125 మంది కళాకారులు ప్రదర్శనల్లో పాల్గొంటున్నట్లు వారు తెలిపారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువతి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంసాలిపేట తమ్మిన పోతరాజు స్కూల్ ప్రాంతానికి చెందిన వీర్ల శివమ్మ, మల్లేశ్వరరావులకు నలుగురు సంతానం. మూడో అమ్మాయి నాగదుర్గ నగరంలోని ఓ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసింది. శనివారం కాలేజీకి వెళ్లి సర్టిఫికెట్స్ తెచ్చుకుంటానని చెప్పి వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. ఆమె తల్లి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

భైభై.. బొజ్జ గణపయ్య

- భక్తిశ్రద్ధలతో నిమజ్జనోత్సవాలు
- ఘనంగా కొనసాగుతున్న చవితి మహోత్సవాలు



కండ్రికలో నిర్వాహకులతో ఎమ్మెల్యే విష్ణు



దావు బుచ్చయ్యకాలనీలో నిమజ్జనోత్సవంలో భక్తులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నియోజకవర్గ వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఏడో రోజైన ఆదివారం గణనాథులకు విశేష పూజలు నిర్వహించారు. పలు మండపాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి, గణనాథులను మేళతాళాలు, కళాకారుల నృత్యాల మధ్య నిమజ్జనానికి తరలించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని గణపతి బొప్పా మోరియా అంటూ ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన విజయ గణపతికి తమలపాకులతో అర్చన, ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు. మధురానగర్ శ్రీ భగవాన్ షిరిడీ సాయిబాబా మందిరంలో ఆదివారం లోక కళ్యాణార్థం లక్ష్మీగణపతి, సుదర్శన హోమం జరిగింది. మందిర గౌరవాధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి దంపతులచే హోమం చేశారు. మందిర అర్చకులు వలివేటి శ్రీనివాసశర్మ ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వినాయకుని ప్రత్యేకగా అలంకరించిన వాహనంలో ఉంచి మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో దాత టి.దుర్గా మల్లికార్జున ప్రసాద్, శివాజీ, ఎం.బాలవర్ధనరావు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు. దావు బుచ్చయ్యకాలనీ తొమ్మిదో లైనులో పర్యావరణ గణపతి నవరాత్రి మహోత్సవాలలో భాగంగా 500 మందికి అన్నదానం జరిగింది. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో పర్యావరణ గణపతిని ఉంచి కోలాటం, నృత్య ప్రదర్శనలతో నిమజ్జనం చేశారు.

అయోధ్య టవర్స్‌లో ముగిసిన ఉత్సవాలు

అయోధ్యనగర్ అయోధ్య టవర్స్‌లో గణపతి నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. లంకలపల్లి నెహ్రూ లడ్డూను వేలంలో రూ.20 వేలకు దక్కించుకున్నారు. సాయంత్రం మేళతాళాలతో నిమజ్జనోత్సవం జరిగింది. కార్యక్రమాలను అయోధ్య టవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ షా అబ్రార్, కార్యదర్శి ఎల్ఆర్ నెహ్రూ, కోశాధికారి పి.శివకిరణ్ పర్యవేక్షించారు. అయోధ్య నగర్ ఇందిరా ఎన్‌క్లేవ్‌లో పసుమర్తి కామేశ్వర శర్మ



తమలపాకులతో విజయ గణపతికి పూజలు

నేతృత్వంలో అరుణ పారాయణం జరిగింది. ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు. వినాయకనగర్‌లో ఏడు రోజులుగా పూజలు అందుకున్న గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి మహిళలు కోలాటం, చిన్నారుల నృత్యం, డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. వినాయకనగర్ గణపతికి నైవేద్యంగా సమర్పించిన 15 కిలోల లడ్డూను వేలంలో వినాయకనగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్



వినాయకనగర్‌లో లడ్డూ దక్కించుకున్న భక్తుడు

అధ్యక్షుడు మట్ల రవి రూ.30 వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమాలను ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కొనసాగుతున్న చవితి వేడుకలు

పాయకాపురం(విజయవాడరూరల్): వినాయకుని దీవెనలు ప్రజలందరికీ ఉండాలని, స్వామి వారి ఆశీస్సులతో సుఖశాంతులతో జీవించాలని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. కండ్రికలో శ్రీలక్ష్మీగణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ కె.రవికుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ.. ప్రతి రోజూ నిత్యాన్నదానం చేయడం ఎంతో పుణ్య కార్యక్రమన్నారు. ప్రతి రోజూ 6 వేల మందికి అన్నదానం చేయడం గొప్ప విషయమని, ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా కె.రవికుమార్ వినాయక చవితి వేడుకలను నిర్వహించడం సంతోషకరమని చెప్పారు. ఎమ్మెల్యే విష్ణు చేతుల మీదుగా అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో కె.రవికుమార్, అల్లు మహేష్, అల్లు నరేంద్రకుమార్, పల్లెల రవి, పొలిశెట్టి చంద్రశేఖర్, పటంశెట్టి నాగఫణి, తోటా ప్రసాద్, వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి యరగొర్ల శ్రీరాములు, పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

పలు మండపాల్లో అన్నదానం

పాయకాపురం(విజయవాడరూరల్): భారతీయులు జరుపుకునే ప్రధాన పండుగల్లో వినాయక చవితి ఒకటని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ అన్నారు. గణేష్ ఉత్సవాల్లో భాగంగా పాయకాపురం, శాంతినగర్‌లోని విఘ్నేశ్వర సేవా సమితి నిర్వాహకులు ఆదివారం అన్న సంతర్పణ నిర్వహించారు. తోట శ్రీనివాస్ చేతుల మీదుగా అన్నసంతర్పణ ప్రారంభించారు. విఘ్నేశ్వర సేవా సమితి నిర్వాహకులు ఆంజనేయులు, మిత్ర బృందాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో 61వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు బల్లం కిషోర్, వాసం దుర్గారావు, దేవళ్ల అశోక్, హరి, ఫణి కుమార్, శ్రీను పాల్గొన్నారు.

లక్ష్మీ గణపతి అష్టైశ్వర్యాలు కలుగజేయాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లక్ష్మీ గణపతి సకల జనులకు అష్టైశ్వర్యాలు కలుగజేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ప్రార్థించారు. విజయవాడ క్లబ్ రోడ్డులోని రివర్ గౌతమి రివర్ బ్రీజ్ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకల్లో ఆదివారం ఆయన పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అపార్ట్‌మెంట్‌లో నివసించే వివిధ ప్రాంతాలకు చెందిన వారు కుల మతాలకు అతీతంగా సమష్టి గా పండుగలను జరుపుకోవడం సంతోషదాయకమన్నారు. ఐకమత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. అనంతరం లక్ష్మి గణపతి హోమం నిర్వహించారు. స్వామి వారిని ఊరేగించి గణేష్ నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో సభ్యులు



లక్ష్మీ గణపతి హోమంలో పాల్గొన్న కలెక్టర్ ఢిల్లీరావు

కె.సుధాకరరావు, వెంకటేశ్వరరావు, వి.వి.ప్రసాద్, అడుసుమిల్లి కృష్ణ ప్రసాద్, ఉయ్యూరు కోటేశ్వరరావు, రామ్మోహన్, సుదర్శన్ రెడ్డి, మణికుమర్, ఎం.రామారావు, చలసాని సతీష్, ఎం.మధుబాబు, అట్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అయోధ్యటవర్స్‌లో..



అన్నదానం చేస్తున్న తోట శ్రీనివాస్



అరుణ పారాయణం చేస్తున్న భక్తులు



మధురానగర్ బాబా మందిరంలో పూజలు

అలరించిన ఆ పాత మధురాలు

విజయవాడకల్చరల్: స్వరఝురి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రుల ముగింపు సందర్భంగా గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికమీద ఆదివారం నిర్వహించిన ఆపాత మధురాలు, భక్తి గీతాల కార్యక్రమం అలరించింది. ఒంగోలుకు చెందిన తాళ్లూరి శ్రీదేవి ఆధ్వర్యంలో అంజిబాబు, డి.కోటేశ్వరరావు అశోక్ ,బాలాజీ, పూర్ణచంద్రరావు, రంగనాథం అంజుస్వామి, పద్మశ్రీలు ఘంటసాల, బాల సుబ్రహ్మణ్యం, జేసుదాసు ఆలపించిన గీతాలను ఆలపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ.. నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పించాల్సిన అవసరముందన్నారు. ఘంటసాల వెంకటేశ్వరరావు పేరుతో జిల్లాలో ఆడిటోరియం నిర్మించడానికి కృషి చేస్తున్నామన్నారు. స్వరఝురి సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలో ఘంటసాల, బాల సుబ్రహ్మణ్యం పేరుతో సినీ సంగీత విభావరి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు



భక్తి గీతాలను ఆలపిస్తున్న గాయనీ గాయకులు

గుండె సమస్యలపై అవగాహన అవసరం

పటమట(విజయవాడతూర్పు): గుండె సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ వరుణ్ అన్నారు. సమభావన మిత్రమండలి ఆధ్వర్యంలో పటమట వాసవ్య మహిళా మండలిలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె సమస్యలను గుర్తించడానికి అవసరమైన అన్ని వసతులు నగరంలోనే అందుబాటులో ఉన్నాయన్నారు. గుండెపై పరిశోధనలు కూడా అత్యధికమయ్యాయని, ఈ నేపథ్యంలోనే అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. అనంతరం సమభావన మిత్రమండలి ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో మిత్ర మండలి విజయవాడ శాఖ అధ్యక్షుడు కోనేరు నరేంద్రబాబు, సభ్యులు టి.శోభనాద్రి, వై.రంగారావు, సీహెచ్ వెంకటరెడ్డి, భాస్కరరావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, ఎంపీ రావు, గోళ్ల నారాయణరావు, ప్రొఫెసర్ ప్రసాద్, తాతినేని శివాజీ, కొండపల్లి మాధవరావు పాల్గొన్నారు.



డాక్టర్ వరుణ్‌ను సన్మానిస్తున్న సమభావన మిత్రమండలి సభ్యులు

మహిళా బిల్లులో ఓబీసీలకు తీరని అన్యాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన మహిళా బిల్లులో దేశంలో 50 శాతానికి పైగా ఉన్న ఓబీసీ మహిళలకు తీరని అన్యాయం జరిగిందని సామాజిక న్యాయ కేంద్ర కన్వీనర్, న్యాయవాది వై.కోటేశ్వరరావు(వైకే) అన్నారు. బందరు లాకుల సమీపంలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో మహిళా బిల్లుపై బీసీ సంఘాలు, బీసీ కులాల ప్రతినిధుల రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం జరిగింది. ఓబీసీ మహిళలకు రిజర్వేషన్ సాధనకు ఉద్యమించాలని సమావేశం తీర్మానించింది. వైకే మాట్లాడుతూ.. దేశంలో 50 శాతానికి పైగా ఉన్న ఓబీసీ మహిళలు, మైనార్టీ మహిళలకు రిజర్వేషన్లు లేకుండా మహిళా బిల్లును రూపొందించడం దుర్మార్గమన్నారు. ఆధిపత్య కులాలకు పార్లమెంట్, శాసన సభల్లో హెచ్చు భాగం స్థానాలు కల్పించడం రాజ్యాంగంలోని సామాజిక న్యాయ సూత్రాలకు విరుద్ధమన్నారు. ఈ బిల్లు ద్వారా మహిళా సాధికారత సాధిస్తామనడం బూటకమని పేర్కొన్నారు. ఓబీసీ మహిళలకు కూడా చట్ట సభల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఓబీసీలకు రిజర్వేషన్లు, జాతీయ స్థాయిలో కుల గణన చేసేంత వరకు ఉద్యమిస్తామన్నారు. ఈ నెల 26న విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో బీసీ సంఘాలు, బీసీ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వైకే

250 మందికి వైద్య పరీక్షలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్

మధురానగర్(విజయవాడసెంట్రల్): అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులను సైతం ఆయుర్వేదం, హోమియో చికిత్స ద్వారా నయం చేయవచ్చునని ప్రముఖ ఆయుర్వేద వైద్యనిపుణుడు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో వైద్యనిపుణుడు డాక్టర్ కోనా వీరబ్రహ్మం అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆరోగ్య అవగాహన ఉచిత వైద్యశిబిరం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎటువంటి దుష్ఫలితాలు లేకుండా అన్ని వ్యాధులను ఆయుర్వేదం, హోమియో చికిత్స ద్వారా తగ్గించుకోవచ్చన్నారు. ప్రస్తుతం వైరల్ జ్వరాలు అధికంగా వస్తున్న దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. ట్రస్ట్ వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ మాట్లాడుతూ.. దాతలు, ట్రస్ట్ సభ్యుల సహకారంతో వృద్ధులకు ప్రతి నెలా నిత్యావసర సరుకులు అందజేయటంతో పాటు ఉచిత వైద్యశిబిరం నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తున్నామన్నారు. అనంతరం 250 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ చంద్రబొట్ల ఆదిత్య, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తిని మానుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): నేరస్తులు నేర ప్రవృత్తి మానుకోవాలని, వినాయక నిమజ్జనాలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు సహకరించాలని గుణదల సీఐ పి.కృష్ణమోహన్ సూచించారు. స్థానిక మధురానగర్ గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరస్తుల కదలికలపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు. నేరం చేసిన ఏ ఒక్కరూ తప్పించుకోలేరని గుర్తుంచుకోవాలని సూచించారు. నేరాలకు పాల్పడినా సహకరించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వినాయక నిమజ్జనాల్లో ఏమైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.



మాట్లాడుతున్న సీఐ కృష్ణమోహన్

● వేడుకగా వీఐటీ - ఏపీ స్నాతకోత్సవం



అమరావతిలో వీఐటీ - ఏపీ విశ్వవిద్యాలయం మూడో స్నాతకోత్సవం క్యాంపస్‌లో వేడుకగా జరిగింది. ఏపీ జ్యుడీషియల్ ప్రివ్యూ కమిటీ చైర్మన్ జస్టిస్ బి.శివశంకర్‌రావు, వీఐటీ ఫౌండర్, చాన్సలర్ జి.విశ్వనాథన్ తదితరులు పాల్గొని విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు.

విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్‌లో వైద్యశిబిరం



లబ్బీపేట(విజయవాడ తూర్పు): విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్ పటమట బ్రాంచిలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో శ్రీకాంత్ డయాబెటీస్ సెంటర్‌కు చెందిన వైద్యులు పాల్గొని బ్యాంక్ సభ్యులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మధుమేహాన్ని నివారించడంతో పాటు వ్యాధిపై డాక్టర్లు ఎం.శ్రీకాంత్, ఎం.సునీతలు అవగాహన కల్పించారు. మధుమేహం రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి, వచ్చిన తర్వాత ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి అనే అంశాలను వివరించారు. ఈ సందర్భంగా 100 మందికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్ మార్గదర్శకులు, మాజీ ఎమ్మెల్యే ఆంజనేయులు వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లను సత్కరించారు. కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్ సీహెచ్ కోటేశ్వరరావు, జోనల్ మేనేజర్ ఈజీ సుబ్రహ్మణ్యం, బ్రాంచి మేనేజర్ ఓ.కొండబాబు, సభ్యులు నార్ల మాలతి, నరసింహారావు, పి.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.